క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ కవచ సంప్రోక్షణ



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న మాజీ ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: మొగళ్లమూరు సెంటర్లో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ధ్వజస్తంభ కవచ సంప్రోక్షణ అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన పూజలో మాజీ ఎంపీ చింతా అనురాధ ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత గణపతి హోమం, శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ధ్వజస్తంభ సంప్రోక్షణలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాండ్రేగుల పెద్దబ్బాయి కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా నిర్వహిస్తున్న హెవీ డ్రైవింగ్ శిక్షణ తరగతులు తొమ్మిదో బ్యాచ్‌గా 16 మంది అభ్యర్థులకు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అమలాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్ మాట్లాడుతూ డ్రైవింగ్‌లో మెళకువలను నేర్చుకొని నైపుణ్యత పెంచుకోవాలన్నారు. డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఆర్టీసీ శిక్షణ కళాశాలలో డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు బస్సుల నిర్వహణపై అవగాహన కల్పిస్తామన్నారు. త్వరలో పదో బ్యాచ్ శిక్షణ తరగతుల ప్రారంభమవుతాయని ఆసక్తి కలిగిన అభ్యర్థులు డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రజాక్ సెల్ 73829 09588ను సంప్రదించాలని డిపో మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టాఫిక్ ప్రతిమా కుమారి, గ్యారేజ్ ఇన్‌చార్జి జీఆర్‌డీఎల్ దేవి, ఓపీఆర్ఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరహాల బాబు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

తాళ్లరేవు: ఆక్వా రంగంలో విభిన్న జాతుల పెంపకం, మెరుగైన యాజమాన్య పద్ధతులపై ఎస్సీ రైతులకు ఐదు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మండల పరిధిలోని చొల్లంగిపేట అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నాక్సా, ఎంపెడా సహకారంతో ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. నాక్సా ఫీల్డ్ ఆఫీసర్ కె.వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక నాయకులు కందెళ్ల గంగబాబు, యండమూరి సత్తిబాబు తదితరులు హాజరై మాట్లాడారు. ఎస్సీ రైతులు ఆక్వా రంగంలో రాణించేందుకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. శిక్షణ పూర్తిచేసుకున్న రైతులకు గంగబాబు సర్టిఫికెట్లను అందజేశారు.

మత్స్యకారుడికి ఎక్స్‌గ్రేషియా పంపిణీ

ఐ.పోలవరం: కాట్రేనికోన మండలం బలుసుతిప్ప గ్రామం బ్రహ్మసమేధ్యం పంచాయతీకి చెందిన కాలాడి సత్తిబాబు గత నెల 17వ తేదీన సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మత్స్యశాఖ ద్వారా అందించే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను సత్తిబాబు భార్య కలాడి దుర్గమ్మకు శుక్రవారం మురమళ్ల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అందజేశారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరావు, సంగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిరియాడికల్ పరీక్షలు ప్రారంభం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ఈ విద్యా సంవత్సరం సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తున్న నేపథ్యంలో శుక్రవారం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పిరియాడికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు వచ్చే నెల 5 వరకూ జరుగుతాయని ప్రాంతీయ విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ తెలిపారు. అదేవిధంగా లాంగ్వేజ్ పండిట్‌లకు సంబంధించి తెలుగు, హిందీ టీజీటీలకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. పీఎస్‌టీగా పనిచేస్తున్న వీరవేణికి తెలుగు టీజీటీగా పదోన్నతి లభించిందన్నారు. అదేవిధంగా హిందీ పీఎస్‌టీలుగా పనిచేస్తున్న గౌసియా, అస్కఘర్ అలీలకు టీజీటీలుగా పదోన్నతి వచ్చిందన్నారు.

హరికథా కళాకారుడు కృష్ణమూర్తి మృతి



చిక్కం కృష్ణమూర్తి (ఫైల్)

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన హరికథా కళాకారుడు చిక్కం కృష్ణమూర్తి (71) గురువారం కర్ణాటకలో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని ఉప్పలగుప్తంలో స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కృష్ణమూర్తి తన హరికథా గానంతో టీటీడీ, ఏపీలోని పలు ఆలయాలు, రాష్ట్రేతర దేవాలయాల్లో తన శ్రోతలతో భక్తులను అలరించారు. దూరదర్శన్, ఆకాశవాణి కేంద్రాల్లో పలు ప్రదర్శనలు చేశారు. కృష్ణమూర్తి చేసిన సేవలకు గుర్తింపుగా 'గాన సుధాకర్' బిరుదు వరించింది. కృష్ణమూర్తి మృతితో గానం మూగబోయింది. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆయనకి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

- సత్ఫలితాల దిశగా పొలంబడి
- సాగు ఖర్చు తగ్గించి పంటల ఉత్పత్తి పెంచడమే లక్ష్యం



నల్లమిల్లిలోని రైతులకు పొలంబడిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి



జనుపల్లిలో పొలంబడిలో సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమలాపురం రూరల్: సాగులో కొత్త విధానాలు అవలంభిస్తేనే మంచి దిగుబడి సాధించి, లాభాలు పొందవచ్చు. వ్యవసాయంలో మారుతున్న సాంకేతికత మార్పులు అన్ని రంగాలపైనా ప్రభావం చూపుతున్నాయి. వాటికి అనుగుణంగా ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ముందుకు వెళితే లాభాలు ఆర్జించగలం. వ్యవసాయ రంగంలో అదే ఒరవడి నడుస్తోంది. ఈ దిశగా రైతులను సంసిద్ధులను చేసేందుకు వ్యవసాయశాఖ 'పొలంబడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పొలం, తోటల్లో పాఠాలకు చెప్పడం వల్ల రైతులు ఆ దిశగా సత్ఫలితాలు పొందుతున్నారు. అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో ఖరీఫ్ సాగులో 'పొలంబడి పిలుస్తోంది'లో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. సాగు ప్రారంభం నుంచి నారుమడులు వేసి, నాటి నుంచి వరినాట్లు ప్రారంభం దశలో రైతులను సాగుకు సన్నద్ధం చేసేందుకు సమావేశాలను నిర్వహించారు. తొలుత సాగు విస్తీర్ణం అంచనా వేసేందుకు కౌలు రైతులను గుర్తించి వారికి సాగు హక్కు పత్రాలు ఇచ్చేందుకు గ్రామ సభలు నిర్వహించారు. వ్యవసాయంలో అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోతున్న రైతులకు సస్యరక్షణ, యాజయాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లోనూ పొలంబడి పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండలంలో ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని క్షేత్రస్థాయిలో ఆ గ్రామంలో 25 నుంచి 30 ఎకరాల్లో రైతులకు ఆధునిక యాజమాన్య పద్ధతులపై ప్రోత్సాహిక రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. అమలాపురం మండలంలో నల్లమిల్లి, జనుపల్లి, అల్లవరం మండలంలో కోడూరుపాడు, ఉప్పలగుప్తం, విలసవిల్లి గ్రామాల్లో ఖరీఫ్‌లో వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏ, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు, అధికారులతో శిక్షణ తరగతులు ఇస్తున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఆయా మండలాల్లో గ్రామాల్లో అవగాహన కల్పించి ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించేలా కృషి చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

సాగులో అధిక ఎరువులు, పురుగు మందులను విచక్షణరహితంగా వాడడంతో విష రసాయన అవశేషాలు ఆహార పదార్థాల్లో ఉండిపోతున్నాయి. వీటి వినియోగంతో రోగాలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటిని నివారించేందుకు సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ ప్రకృతి పద్ధతులతో భూసారాన్ని పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన పంట సాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నారు.

అమలాపురం నియోజకవర్గంలో వరి సాగు వివరాలు	
మండలం	వరిసాగు (ఎకరాల్లో)
అమలాపురం	4,781
అల్లవరం	2,650
ఉప్పలగుప్తం	3,980

తక్కువ ఖర్చు అధిక దిగుబడి

మెరుగైన సేవలు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనతో పాటు, ఎరువులు, నీటి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా వ్యవసాయాధికారులు ప్రతి వారం ఎంపిక చేసిన గ్రామాల్లో పొలంబడి నిర్వహిస్తున్నారు. ఆధునిక పద్ధతుల్లో సేద్యంపై శిక్షణ ఇస్తున్నారు. మిశ్రమ ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచడం, సేంద్రియ వ్యవసాయం, శత్రు, మిత్ర పురుగుల గుర్తింపు, ఆధునిక పద్ధతిలో పంటసాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు బ్యాలెట్ బాక్స్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఆరోగ్యకర పంటలను పండించడం అన్నదాతలను సాగులో నిష్ణాతులను చేయడం, మిత్ర పురుగులను సంరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో వీటిని నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు ఆధ్వర్యం వహిస్తున్నారు.

నూతన పద్ధతులపై అవగాహన



నూతన యాజమాన్య పద్ధతులను తెలుసుకునేందుందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చేను పరిస్థితి అంచనా వేయడంతో పాటు కొత్తగా ఏమైనా తెగుళ్లు ఆశిస్తే వాటిని నివారించే విధానాన్ని తెలియజేస్తున్నాం. సాగు ఖర్చు తగ్గించి పంట దిగుబడిని పెంచడమే లక్ష్యంగా పొలంబడి నిర్వహిస్తున్నాం.

– కదలి ధర్మప్రసాద్, మండల వ్యవసాయాధికారి, అమలాపురం

మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు



అమలాపురంలో మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ మనోహర్ తదితరులు

అమలాపురం టౌన్: వన మహోత్సవం సందర్భంగా అమలాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు శుక్రవారం మొక్కలు నాటారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఎస్.మనోహర్, డీఈఈ సీహెచ్ నాగసతీష్, ఏఈలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో మొక్కలు నాటి వన మహోత్సవాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం, వాటర్ వర్క్స్ కార్యాలయం ప్రాంగణాల్లో కూడా మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, ఏఈలు వెంకటేష్, భాస్కరరావు, సత్యనారాయణ, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ముమ్మిడివరం: ప్రకృతి సంరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. వనం – మనం కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ నాలుగో వార్డులోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం మెక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.

రీజెన్సీ ప్రారంభానికి ప్రభుత్వంతో పోరాటం

ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్



యానాం: రీజెన్సీ పునఃప్రారంభం కాకుండా, స్థానిక కార్మికులకు ఉపాధి దక్కకుండా రాజకీయ స్వార్థంతో కొందరు అడ్డుకుంటున్న నేపథ్యంలో కంపెనీ యాజమాన్యంతో కలిసి పుదుచ్చేరి ప్రభుత్వంపై కలిసి పోరాటానికి అందరూ సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మల్లాడి కృష్ణారావు, సీఎం రంగసామి కలిసి రీజెన్సీ తెరవకుండా అడ్డుపుల్ల వేస్తున్నారని ఆరోపించారు. అప్పటి ఆర్ఏఓ జవహర్ ఆధ్వర్యంలో కార్మికులకు, యాజమాన్యానికి ఒప్పందం జరుగుతున్న దశలో, మల్లాడి ఆయనను బదిలీ చేయమని పట్టుబట్టి బదిలీ చేయించిన అనంతరం శాంతిభద్రతలు అదుపుతప్పాయన్న సంగతి ప్రజలకు తెలుసునన్నారు. అప్పట్లో జవహర్ ఉండి ఉంటే ఘర్షణలు జరిగేవి కావన్నారు. తాను శాసనసభ్యుడిగా గెలిచినప్పటి నుంచి, 2012 నుంచి మూతపడిన భారీ రీజెన్సీ ఫ్యాక్టరీ తెరిచే విధంగా వివిధ రకాలుగా యాజమాన్యానికి తనవంతు సహకారం అందిస్తున్నానన్నారు. దగ్ధమైన ఫ్యాక్టరీ యంత్రాల స్థానంలో సంబంధిత యాజమాన్యం సుమారు రూ.50 కోట్ల పెట్టుబడితో నూతన యంత్రాలు పెట్టుకుని, గ్యాస్ పైపులైను సైతం వేసుకున్నారని చెప్పారు. ప్రారంభానికి సిద్ధం చేసుకున్న దశలో పుదుచ్చేరి ఉన్నతాధికారుల నుంచి రావాల్సిన అనుమతులను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. యానాం నియోజకవర్గ పూర్వ వైభవం, పారిశ్రామిక ప్రగతి కార్మికుల శ్రేయస్సే తనకు ముఖ్యమన్నారు. చిత్తశుద్ధి ఉంటే తనతో కలిసి పోరాటానికి మల్లాడి సిద్ధమా అని ఆయన ప్రశ్నించారు.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే..



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలను ఆచరిస్తున్న మహిళలు

ఐ.పోలవరం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచీ తరలివచ్చిన సుమారు 1500 మంది మహిళలు పాల్గొన్నారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మండపం, అభిషేక మండపం, ప్రదక్షిణలు చేసే ప్రాంతాలలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. తొలుత ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, మాజీ చైర్మన్ కఠారి నాని, దాట్ల రామకృష్ణంరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు.

ముమ్మిడివరం: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రముఖ ఆలయాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామూహిక లక్ష కుంకుమార్చన

అమలాపురం రూరల్: బండారులంక బిళ్ల వారి వీధిలో వేంచేసిన పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాస బాల మిత్ర సంఘం ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. తొలుత గణపతి పూజ నిర్వహించి అనంతరం అమ్మవార్లకు విశేష కుంకుమార్చన జరిపారు. ఆలయ అర్చకుడు బి.భీమేశ్వరరావు అర్చకత్వంలో మహిళలకు ఉచిత లక్ష్మీదేవి డాలర్, వేంకటేశ్వరస్వామి ఫొటో, కాశీ నుంచి తెచ్చిన రుద్రాక్షలు, పూలమొక్కలు, కంకణం, లడ్డూ ప్రసాదం, రవిక, గాజులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు, పిల్లి పల్లపరాజు, కొండా సుబ్రహ్మణ్యం, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



వాసవీ మాత ఆలయ ప్రాంగణంలో వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

కనకదుర్గ సన్నిధిలో..

అమలాపురం టౌన్: స్థానిక గాంధీనగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సామూహిక వ్రతాలకు గాంధీనగర్ నుంచే కాకుండా పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు తరలివచ్చారు. వీహెచ్‌పీ రాష్ట్ర మహిళా ప్రముఖ్ సునీత పర్యవేక్షణలో వ్రతాలు శాస్త్రోక్తంగా సాగాయి. వ్రతాలను ఆచరించిన మహిళలకు దాతలు పూజా సామగ్రి సమకూర్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు శిరంగు నాయుడు, భమిడిపాటి కృష్ణమూర్తి, వేణుగోపాల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు తిక్కిరెడ్డి ఆదినారాయణ, మున్సిపల్ కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక వరలక్ష్మీదేవి వ్రతాలు శాస్త్రోక్తంగా గావించారు.

ఎడతెరిపి లేని వర్షంతో అవస్థలు



సుంకరపాలెం జంక్షన్‌లో వర్షం నీటిలో జనం అవస్థలు

తాళ్లరేవు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనం అవస్థలు పడుతున్నారు. గురు, శుక్రవారాల్లో తాళ్లరేవు మండలంలో సుమారు 20 మిల్లీ మీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా తాళ్లరేవు, కోరంగి ప్రధాన రహదారులతో పాటు యానాం–ద్రాక్షారామ రహదారిలోని సుంకరపాలెం వద్ద నీరు నిలిచిపోయి వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రహదారిపై చేరుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

స్తంభించిన జన జీవనం

అమలాపురం టౌన్: జోరు వర్షం కాకపోయినప్పటికీ శుక్రవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ఏకధాటిగా కురిసిన వర్షంతో పట్టణంలో దాదాపు జనజీవనం స్తంభించింది. ఉదయం నుంచి చాలా దుకాణాలు తెరచుకోలేదు. వర్షం వల్ల ప్రయాణికుల సంఖ్య తగ్గి పట్టణ ప్రధాన రోడ్లు వెలవెలబోయాయి. రోడ్లపై ప్రజలు అంతంత మాత్రంగానే కనిపించారు. సాయంత్రం నుంచి కొందరు ప్రజలు గొడుగులు, రైన్ కోట్‌లతో బయటకు వచ్చి మార్కెట్ పనులు చూసుకున్నారు. రాత్రి ఏడు గంటలకే దాదాపు ప్రజలు ఇళ్లకు చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ చాలా మంది ఏ పనీ పెట్టుకోకుండా ఇళ్లకే పరిమితమయ్యారు. మరీ అర్జెంట్ పనులు ఉంటే తప్ప వర్షంలోకి రాకుండా జాగ్రత్త పడ్డారు. అసలే సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఈ ఎడతెరిపిలేని వర్షాల్లో తడిచి అనారోగ్యం పాలయ్యేందుకు భయపడ్డారు. పట్టణంలో డెంగీ జ్వరాల జాడ ఎక్కువగా ఉండడంతో పాటు టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ప్రజలకు కుదిపేస్తున్న క్రమంలో ఈ వర్షాలకు ఇళ్ల వద్దే ఉండిపోయి అప్రమత్తతతో కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

బాలభవన్ చిన్నారులకు సాయం



చిన్నారులకు కిసాన్ వికాస పత్రం అందజేస్తున్న సూపర్‌వైజర్ కొండలరావు, సిబ్బంది

యానాం: యానాం పాఠశాల విద్యాశాఖ పరిధిలోని జవహర్ బాలభవన్‌లో చదువుతున్న పెన్నాడ అలేఖ్య (7వ తరగతి), పెన్నాడ కార్తిక్ (3వ తరగతి)కు బాలభవన్ యంత్రాంగం బాసటగా నిలిచింది. వారి తరఫున సూపర్ వైజర్ చింతా కొండలరావు, సిబ్బంది సమకూర్చిన రూ.75 వేలను కిసాన్ వికాస్ పత్రం రూపంలో చిన్నారులకు శుక్రవారం అందజేశారు. చిన్నారుల తండ్రి పెన్నాడ బుజ్జియ్య (35) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు చిన్నారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులను ఆదుకోవాలనే సంకల్పంతో బాల భవన్ ఉద్యోగులు తమకున్న పరిచయాలతో రూ.75 వేలు సమకూర్చారు. చిన్నారుల చదువు కోసం వచ్చే తొమ్మిదేళ్లలో రూ.75 వేలు కాస్తా రూ.1,50,000 అవుతాయి. ఈ మేరకు తల్లి వీరవేణి పేరిట యానాం పోస్టాఫీసు నుంచి తీసుకున్న కిసాన్ వికాస పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ చింతా కొండలరావు, వాసిరెడ్డి శ్రీవాత్సవి, మహేంద్రవాడ నరసింహమూర్తి, కాశి జ్యోత్స్న పాల్గొన్నారు.

వాయనాడ్ బాధితులకు విరాళం



వరద బాధితుల కోసం సేకరించిన చెక్‌ను రాష్ట్ర యూనియన్‌కు అందజేస్తున్న జిల్లా కమిటీ

అమలాపురం టౌన్: కేరళలోని వాయనాడ్ వరద బాధితుల సహాయ నిధికి అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ రూ.4.50 లక్షలు సేకరించి విరాళంగా సమకూర్చింది. యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి అధ్యక్షతన స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీ రాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరామమ్మలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా యూనియన్ తరఫున సమకూర్చిన రూ.4.50 లక్షల చెక్‌ను కేరళ వాయనాడ్ వరద బాధితుల సహాయ నిధికి జిల్లా యూనియన్ ప్రతినిధులు రాష్ట్ర యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి పలు సమస్యలపై చర్చించి వాటి పరిష్కారాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలపై వేధింపులు పెరిగాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, అంగన్‌వాడీ జిల్లా యూనియన్ కోశాధికారి పి.అమూల్య, కె.సుజాత, కె.వెంకటలక్ష్మి, దైవ కృప, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి



వడ్డిగూడెంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

అమలాపురం టౌన్: పట్టణంలో పలు డెంగీ కేసులతో పాటు వైరల్ జ్వరాలు ప్రబలుతున్న క్రమంలో సంక్షేమ హాస్టళ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టళ్లలోని విద్యార్థులతో ఆమె నేరుగా మాట్లాడడమే కాకుండా హాస్టల్‌లో పారిశుధ్య చర్యలపై ఆరా తీశారు. హాస్టళ్లలో ఆహారం తయారీ, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రతపై హాస్టళ్ల అధికారులు, విద్యార్థులతో చర్చించారు. విద్యార్థుల్లో ఏ మాత్రం జ్వర లక్షణాలు కనిపించినా హాస్టళ్ల వార్డెన్లు తక్షణమే స్పందించి వారిని ఆస్పత్రులకు తరలించి వైద్యులతో ప్రత్యేక వైద్యం అందించాలన్నారు. కొంకాపల్లి, వడ్డిగూడెం, మద్దాల వారిపేట, ఎర్ర వంతెన వద్ద ఉన్న సంక్షేమ హాస్టళ్లను ఆమె తనిఖీ చేశారు. చైర్‌పర్సన్ వెంట మున్సిపల్ ఏఈ వెంకటేష్, ఆయా వార్డు సచివాలయాల శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు ఉన్నారు.

ఉచిత ఇసుక విధానంపై మార్గదర్శకాలు

అమలాపురం రూరల్: రాష్ట్రంలో వచ్చేనెల 11 నుంచి నూతన ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయనున్న దృష్ట్యా నూతనంగా జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. ఇసుక విధానంపై శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మైనింగ్ శాఖ ఉన్నతాధికారులతో కలసి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. అమలాపురంలో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మహేష్ కుమార్, జేసీ టి.నిశాంతి, గనులు, రవాణాశాఖ అధికారులు హాజరయ్యారు. మీనా మాట్లాడుతూ ఇసుకను ప్రజలకు ఉచితంగా అందించడానికి ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్ రూపొందిస్తున్నామని, దాని ప్రారంభానికి ముందస్తుగా అవసరమైన కార్యకలాపాల గడువు తేదీల గురించి వివరించారు.

ఎన్ఎంయూ ఉద్యోగుల ధర్నా

అమలాపురం రూరల్: ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్(ఎన్ఎంయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమలాపురంలో శుక్రవారం ఆర్టీసీ గ్యారేజ్ వద్ద తమ సమస్యలపై ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ట్రెజరీ శాఖ నిలిపివేసిన డ్రైవర్లు, కండక్టర్ల నైట్ అవుట్ అలవెన్సులను తక్షణమే పునరుద్ధరించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, నిర్ణీత సెలవుల బకాయిలు చెల్లించాలని, తదితర సమస్యలపై నిరసన తెలిపారు. యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఉద్యోగులు ఆందోళనకు మద్దతు తెలిపారు. జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు, డిపో అధ్యక్షుడు ఎలియా, కార్యదర్శి పితాని మణిరాజు, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి, డిపో కార్యదర్శి రంగప్రసాద్, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలపై శిక్షణ



శిక్షణ పొందిన యువతతో ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జీవన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, మానవతా విలువలను నేటి యువత అలవరచుకోవాలని బెంగళూరు ఇండియన్ సోషల్ ఇనిస్టిట్యూట్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఫెసిలిటేటర్ జి.కరుణాకర్ అన్నారు. ఆ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో స్థానిక కార్మిలైట్ సిస్టర్స్ ఆఫ్ సెయింట్ థెరిసా భవనంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో కరుణాకర్ శుక్రవారం మాట్లాడారు. యువతకు కరుణాకర్ శిక్షణ ఇస్తూ 'వ్యక్తుల సామర్థ్యాలను పెంపొందించేందుకు వ్యక్తిగత అవసరాలు, ప్రాధాన్యతలను గుర్తించి వాటి పరిష్కారానికి వ్యూహాత్మకమైన ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. జీవన నైపుణ్యాలను మెరుగు పరుచుకుంటూనే నాయకత్వ లక్షణాలు, సామాజిక భావాలను వృద్ధి చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం యువతీ యువకులకు ప్రశంసా పత్రాలు, ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో కార్మిలైట్ సిస్టర్స్, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ప్రసాద్, నాగేంద్ర, ఆ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలి



సుంకరపాలెంలో డ్రైనేజీ సమస్యను ఎన్‌హెచ్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు: జాతీయ రహదారి 216పై సుంకరపాలెం జంక్షన్ వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించి తగు చర్యలు చేపట్టాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సుంకరపాలెం సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు, స్థానిక నాయకులు ఎన్‌హెచ్ అధికారులతో కలసి రహదారులపై నిలిచిపోయిన నీటిని, డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు, వర్తక సంఘం ప్రతినిధులు నీరు నిలిచిపోయి తాము పడుతున్న ఇబ్బందులను అధికారులకు వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ఎమ్మెల్యే దాట్ల అధికారులతో చర్చించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని ఎన్‌హెచ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వేగేశ్న భాస్కర్రాజు, చీకట్ల నాగేశ్వరరావు, వర్తక సంఘం అధ్యక్షుడు నామా గోపి పాల్గొన్నారు.

విద్యార్థులకు నేరాలపై అవగాహన అవసరం

అమలాపురం టౌన్: స్థానిక విద్యానిధి పాఠశాలలో పట్టణ పోలీసులు విద్యార్థులకు గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్ అవేర్‌నెస్ క్యాంపును శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు ముఖ్యంగా ఆడపిల్లలు ప్రతి అడుగు అప్రమత్తతతో వేయాలని, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి విషయాల్లో మరీ జాగ్రత్తగా ఉండాలని పట్టణ సీఐ కె.క్రిస్టోఫర్ సూచించారు. సైబర్ నేరాల అదుపునకు ప్రతి విద్యార్థి అవగాహనతో ఉండాలని పట్టన ఎస్సై కిషోర్‌బాబు అన్నారు. పట్టణ ట్రాఫిక్ విషయంలో కూడా విద్యార్థులు అవగాహనతో ఉండాలని సూచించారు. ఆడ పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలపై విద్యార్థినులు చైతన్యంతో ఉండి ఆపద సమయం వస్తే స్వీయరక్షణతో, ఆత్మ స్థైర్యంతో ఎదుర్కొనే శక్తియుక్తులు, సమయస్ఫూర్తి కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుత సమాజంలో నేరాల తీరు, వాటిని బారిన పడకుండా చైతన్యంతో జాగ్రత్తలు తీసుకోవడం కూడా ఓ తెలివైన పనేనని సీఐ క్రిస్టోఫర్ విద్యార్థులకు సూచించారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు కూడా విద్యార్థులనుద్దేశించి పలు జాగ్రత్తలు సూచించారు.